
# దేవయ్య – దేవదేవి



"ఏమిటి, అలాగ దీర్ఘంగా ఆలోచిస్తున్నారు" అన్నాడు రామం లీలనే చూస్తూ. రివ్వన వీచే గాలిలో ఆ మాటలుకూడా దూసుకు పోయాయి కాబోలు, ఆమె చలించలేదు ఆ పచ్చగడ్డిమీద పడుకుని అలాగే ఆలోచిస్తూంది. ఆమె కళ్ళజోడు నేలమీద పడివుంది ప్రక్కన ప్రవహించే గోదావరి హోరుమంటూ వాళ్ళని లక్ష్యపెట్టకుండా పోతూంది. దూరాన బ్రిడ్జి మీద రైలు మెల్లగా సాగుతూంది.

ఈ దృశ్యాన్ని వర్ణిస్తూ, తన కాలేజీ దినాలని తలుచుకుని కంట తడిపెట్టే వాసుదేవరావు గారు జ్ఞాపకం వచ్చారు రామానికి. ఈ క్షణంలో రామానికి మాత్రం ఆ రైలుని చూస్తే ఉత్సాహం కలగలేదు సరిగదా, అది శరవేగంతో పరుగెత్తితే బాగుండు ననిపించింది. జీవిత రంగంలో కొన్ని ఘట్టాలు ఎంత వేగంగా గడవాలని మనుష్యులు తహతహలాడినా, అవి కదలనే కదలవు.

"అదేమిటో చూసేరా? ఆ పచ్చటి కాంతి" అన్నాడు రామం మళ్ళీ లీలని మాట్లాడించాలని. ఆమె కన్నెత్తి చూసింది. మళ్ళీ దృష్టిని దింపుకుని ఆలోచనలో పడింది. ఆమె స్మృతిపథంలో ఏయే రంగాలు తిరుగుతున్నాయో బోధపడలేదు రామానికి.

లీలా, రామం ఒకే రోజు కాలేజీలో ప్రవేశించారు. అందుచేతనే వాళ్ళిద్దరికీ యింత స్నేహం ఆ క్లాసులో ఇంకెవరితోనూ మాట్లాడని లీల, రామంతో చనువుగా మాట్లాడుతుంది. శెలవుల్లో ఉత్తరాలు రాస్తుంది. ఒకప్పుడు తన విషాద చరిత్రనంతా అతనితో చెప్పుకుని అతను పలికిన ఉపశమన వాక్యాలతో కొంత శాంతిని పొందింది. ఆమె చరిత్ర విన్నప్పటినుంచీ రామం మనస్సులో అంతర్యుద్ధం ప్రారంభమయింది. ఆఖరికి ఏది ఎలాగైనా నిస్సహాయురాలైన ఆ అబలకు సహాయంచేసి సంఘ సంస్కర్త ననిపించుకోవాలని నిశ్చయించుకున్నాడు.

లీల పెళ్ళి పదమూడో యేటనే జరిగిపోయింది. ఆమె రెండు సంవత్సరాలు వైవాహిక జీవితం గడిపిందో లేదో భర్త పరమపదించాడు. ఆనాటితోనే లోకదృష్టి మారింది. ఒకనాడామెను సౌందర్యవతిగా, అదృష్టవతిగా జమకట్టిన లోకం ఆమెను దురదృష్టవంతురాలిగా చూడడం మొదలు పెట్టింది. ఆమె మీద కూడా ఏవో వింతసంఘటనలు విరుచుకు పడ్డాయి. ఇక ఆమెకు విద్యమీద తప్ప ఏవస్తువు

మీదా ఆపేక్ష లేదు. అస్తమానం ఆమె మనస్సు అజ్ఞాతమైన కాలపుటంచులను దర్శించడానికి పరుగులెత్తుతుంది. జీవితం, సుఖం అనేవాటిని గురించి నిశితంగా విమర్శించుకుంటుంది. 'వ్యక్తులు బలహీనులై తప్పుదారుల్లో పడిపోవచ్చు. కాని జీవితం మాత్రం పవిత్రమైన రాచబాట' అంటుంది. ఆమె చరిత్ర, సిద్ధాంతాలు విన్న కొలదీ రామంలో ఒక ఆప్యాయం, కాదు ఆపేక్ష, కాదు అదేదో అనిర్వచనీయమైన అనుభూతి ప్రబలిపోయింది. ఇదమిత్థమని తేల్చుకొని కూడా పైకి మాట్లాడలేక పోయాడు. మళ్లీ తలెత్తి చూస్తే, లీల అలాగే పడుకొని గడ్డిపరకనొకదాన్ని కొరుకుతూంది.

తిరిగి తలవంచుకుని ఆలోచనల్లో పడ్డాడు రామం. వారం రోజులక్రితం లీల రాసిన ఉత్తరం ఒకటి స్ఫురణకు వచ్చింది. "మన ఉత్తరాల్లో సోదరా, సోదరీ అనే సంబోధనలు మాని అసలు పేర్లతో ఎందుకు పిలుచుకోకూడదు? ఆపైన, మనం పరస్పరం 'మీరు' అనుకోడం మాని 'నువ్వు' అని ఎందుకనుకోరాదు?" ఈ రాతలలో లీల ఎంతో గూఢార్థం ఇమిడ్చివుండాలి. ఆలోచించగా రామానికి ఆ రాతల్లో ఎంతో సత్యం వున్నట్లు తోచింది. సంఘపు కట్టుబాట్లకి భయపడి పిలుచుకోవడం కేవలం అసహజాన్ని కల్పించుకోవడమే! ఇద్దరిమధ్యావున్న దూరాన్ని తగ్గించి బాహ్యబాధలని సడలించుకుని లీలకి సన్నిహితుడు కావాలని నిశ్చయించుకున్నాడు. కాని, పరోక్షంలో ఎంత తీర్మానించుకున్నా సమక్షంలో ఆమెను 'నువ్వు' అనలేక పోతున్నాడు. తన సమ్మతిని తెలపాల ఎంత తహతహలాడినా మాట రావడం లేదతనికి. దానికి తగినట్లు లీల కూడా ఏమీ మాట్లాడకుండా దీర్ఘంగా ఆలోచిస్తూంది. ఎలాగో ధైర్యం తెచ్చుకుని రామం "అదేమిటో చూసేరా! లీలా!" అన్నాడు.

ఆ పచ్చటి కాంతి వాళ్ళని సమీపిస్తూంది.

"అది భద్రాచలం పోయే స్టీమరు దీపం" అంది లీల.

అవును. ఆ స్టీమరునిండా యాత్రికులు పాటలు పాడుకుంటూ పోతున్నారు ఆ మహా ప్రవాహాని కెదురుగా.

"దైవదర్శనం ద్వారా లభించే ఆనందమే వీరి గమ్యస్థానం. దాన్ని చేరుకుందుకు వీరు ఒక్కొక్కరే ఒంటరిగా పోతుంటే ఎంత బాగుండును" అన్నాడు రామం.

"ఒంటరిగా ప్రవాహాని కెదురీదడం అంత సులభమంటారా?" అంది లీల.

"మరి మీ రేమంటారు" అన్నాడు రామం.

"అదంత తేలిక కాదు. ఇంకెవరి తోడైనా వుంటే ఆ పని కొంత తేలిక కావచ్చు"- ఇలా పలికిన లీల వాక్కుల్లో ఏవో అమూల్యమైన అర్థాలు గోచరించాయి రామానికి. అవన్నీ అతని అంతర్వాణితో ఏకీభవిస్తూనే వున్నాయి. అతనూ కోరేదదే. తన సమ్మతిని తెలుపుదామని రామం ప్రయత్నించాడు. కాని, అంత తేలికగా చెప్పేస్తే ఎట్లాగ? ఇంతలో లీల లేచి నిలబడింది. ఒక కుర్రాడు వాళ్ళకేసి వస్తూన్నాడు. "సరే వస్తానండీ. మా మరిది వస్తున్నాడు" అంది లీల.

"మీ మరిదా? ఏం చేస్తున్నాడీ అబ్బాయి".

"చదువుకుంటున్నాడు, మా యింట్లో నన్ను మంచిగా చూసేది కృష్ణా గాకొక్కడే" అంటూ లీల మరిదికి ఎదురు వెళ్ళింది. మాటలన్నీ మనస్సులో బిగుసుకుపోయిన రామం అలాగే వాళ్లు కనబడినంతసేపూ చూస్తూ అక్కడే కూలబడ్డాడు. అతనిలో యుద్ధం ప్రారంభమైంది.

"లీలని పెళ్ళిచేసుకోవడం అంత సులభం కాదు. వితంతు వివాహాలు ఎంత మంచివైనా విరివిగా సాగడం లేదు"

'లీల అపురూప సౌందర్యవతి. ఆమె భార్యకావడం సౌభాగ్యం కాదూ?"

"జాగ్రత్త. అసలే దత్తపుత్రుడివి. ఆస్తితో చెలగాటం"

"నే నంత భయపడే రకం కాదు. లీల కాలి గోరుకు సరిపోదీ ఆస్తి"...ఇలాగ అతనిలో ఎంతసేపు నడిచిందో రణరంగం. చివరికి ఏదీ తేలక ఆ చీకటిలో కాళ్ళీడ్చుకుంటూ యిల్లు చేరుకున్నాడు.

ఏది ఎలాగున్నా లీల యెదుట తన భావ వివరణం ఎన్నడూ అతని నోటంట జరగలేదు. ఎందుకు జరగలేదో ఊహించడం అతనికీ కష్టమే. ఇంత నాగరకత సంపాదించాననుకునే రామం ఒక అమాయకపు అబలని ప్రేమించిన సంగతి

ఆమెతో చెప్పలేక పోయాడంటే వింతగానే తోస్తుంది. కాని ఎన్ని వింతలు జరగటంలేదు నిత్యమూ? ఆపైన, అతన్ని బాధించే అనుమానం ఏమంటే - ఈసంగతి లీలే స్వయంగా ఎందుకు చెప్పకూడదు! అని ఆమెకోసం తాను త్యాగం చేస్తున్నాడు కాని, అతనికోసం ఆమె చేసే త్యాగమేమిటి? ఇలాగ అనుమానం అభిమానం రామాన్ని క్రుంగతీస్తూ వచ్చినవి.

ఒక సాయంత్రం మళ్ళీ మాటల సందర్భంలో "ఆ నక్షత్రాన్ని చూసేరా! లీలా" అన్నాడు రామం అరుంధతిని చూపిస్తూ.

"ఆ నక్షత్రంకన్న దాన్ని అనుసరించుకున్న నీడ ఎక్కువ ఆకర్షిస్తోంది నన్ను" అన్నదామె.

ఇక ఆమె ఇలాగ లొంగదని,

"అయితే, ఒక్కమాట అడుగుతాను. దాచకుండా చెపుతారా" అన్నాడు రామం.

"అడగండి. ద్విజిహ్వనుకాను" అంది లీల నిశితంగా చూస్తూ.

"లీలా! మీ భావిజీవితాన్ని గురించి అడగాలనుకుంటున్నాను"

"ఇలా నడుస్తోందిగా" అంది లీల చప్పగా.

"అదికాదు. వ్యర్థమై పోతున్న యవ్వన మాధురులు తిరిగి రావని తెలుసా!"

లీల మందంగా నవ్వింది.

"లీలా! మీ పునర్వివాహం సంగతి"

"ఇంతవరకూ ఆలోచించనే లేదు"

"ఎందుచేత?"

"అవసరం కలిగినప్పుడు చూచుకోవచ్చని వాయిదా వేశాను" అంది లీల.

రామం నెత్తిన బరువు మోపినట్లయింది. లీల పెద్ద మోసకత్తెలా మారిందీ? లోపలభావాలు అణచుకుని, పైకి అమాయకత్వం ప్రకటిస్తోంది అనుకున్నాడు. ప్రతీ వాక్యంలో గూఢార్థం ఇమిడ్చి మాట్లాడే లీల తనతో ఇంత చులకనగా మాట్లాడుతుందని ఎన్నడూ అనుకోలేదు రామం. ఇంతలో మళ్ళీ లీల మరిదిని చూచి వెళ్ళిపోయింది. రామంలో కొన్ని క్రొత్త అభిమానాలు తలెత్తాయి. "నాకెందుకు-కంటకిలేని దురద? ఇలాగ అవమానిస్తుందా? నేనేం గతిలేక తనని పెళ్లి చేసుకోవాలని చూసేననుకుందేమో. ఆవిషయమే ఎత్తను. ఎవళ్ల కర్మ వాళ్లది" అనుకుంటూ రామం ఇంటిదారి పట్టేడు.

మళ్లీ మూడేళ్లకిగాని లీలని చూడడానికి అవకాశం చిక్కలేదు రామానికి. ఉత్తర దేశంలో ఉద్యోగం చేస్తూ సెలవుమీద రావడం తిన్నగా లీల యింటికి దారితీశాడు రామం. లీల కంపెనీలో ఉద్యోగం చేసుకుంటూ స్వేచ్ఛా జీవితాన్ని గడుపుతోంది. ఆమెకు బంధువుల ప్రమేయమే లేదు. వస్తేగిస్తే కాలేజీలో చదువుతూన్న మరిది చూచిపోతుంటాడట ఎప్పుడైనా రామాన్ని ఇన్నాళ్లకు చూసినందుకు లీల చాలా సంతోషించింది. "ఆమెలో ఎన్నడో ఎండిన మోడులు చిగిరిస్తున్నాయి కాబోలీవేళ! నేను మాత్రం అప్పటికీ, యిప్పటికీ సిద్ధమే. కాని ఆమెలోని అహంకారాన్ని మాత్రం సహించలేను. తనకుతానై మనసు విప్పితే నేను సంసిద్ధుణ్ణే" ప్రతీ నిముషం సమాధాన పరచుకొంటున్నాడు రామం. ఎప్పటిలాగ ముభావంగా వుండక లీల


ప్రఖ్యాతిగాంచిన ప్రశస్తమైన

**మెహతావారి**
**విశేష ఔషధములు**

1. సుందరి ఎలిగ్జిర్ :–సమస్త ఋతు దోషములను పోగొట్టును, గర్భాశయరోగ అనువను నివారిణి.
2. ఫాస్ఫరస్ ఆయిల్ :–బాధ నివారణకు సాటిలేని తైలము.
3. మస్తానాపిల్సు :–సాధారణబలహీనత, కీళ్లనొప్పులు, జ్వరము ఇన్నిటికి అమోఘముగా పని చేయును.
4. ద్రాక్షాసవము :–(బంగారము, మకరధ్వజము కలిసినది) రక్తమును శుద్ధి పరచునటువంటి, అజీర్ణము రూపు మాపునటువంటి బలవర్ధకౌషధము.

కెమిస్టు లందరివద్ద దొరకును.

తయారు చేయువారు:

**K. S. MEHTA & CO.**
**250, China Bazar, Madras.**

వాళ్లనీ వీళ్లనీ విమర్శించడం ప్రారంభించింది. తన ఆఫీసు అనుభవాలు, అక్కడి యువక బంధరాల వెర్రిపోకడలు ఏకరు పెట్టింది. 'అదంతా ఉద్యోగ ప్రభావం - అయితేనేం ఉద్యోగం మాన్పించడానికెంతసేపు పడుతుందిలే' అనుకున్నాడు రామం. లీల మళ్లీ ప్రారంభించింది. సముద్రపు టొడ్డు, బెజవాడ స్టేషను, ఉష్ట్ర పక్షులు, ఎడారి యాత్ర... ఏవేవో మాట్లాడేస్తోంది. ఇవన్నీ వింటూ అర్థం తెలియక కొట్టుకుంటున్నాడు రామం. ఆ క్షణంలో కొంచెం ద్వేషభావం కూడా కలిగింది. కాని, కాలేజీ లీలని తలుచుకుంటే ఎక్కడి దక్కడ మాయమైంది. రామం అలాగే కూర్చుని చూస్తున్నాడు. లీల బాగా మారిపోయింది. నాజూకు మాలతీలత వంటి లీల అరటిచెట్టులాగ వుంది.

"కొంచెం సన్నపడడానికి మందు పుచ్చుకోండి లీలా" అన్నాడు చిరునవ్వుతో.

"తమ కేం సన్నంగా లేరు. అద్దం తెమ్మన్నారా?" అంది లీల. అంతేకాదు, లావెక్కిన స్నేహితుల్ని గురించి మొదలుపెట్టింది. నరేంద్రరావు, పద్మావతి, హుమయూన్ ఖాన్, సూర్యకాంతం...వీళ్ళంతా రెట్టింపు మనుష్యులయ్యారట. తననూ వాళ్ళతో జమకట్టలేదు కదా! అనుకున్నాడు రామం, ఇంతలో గుమ్మంలోకి వచ్చిన వ్యక్తిని చూసి లీల నిలబడింది. లోనికి పోయి ఇంకో కుర్చీ తెచ్చింది. అతను లీల మరిది. ఎం. ఎస్. సి. చదువుతున్నాట్ట. బాగా మారిపోయాడు. రామం బయలుదేరాడు.

ఆరునెలలు గడిచేయి. రామం ఆఫీసు పని మీద మద్రాసు పోతున్నాడు. లీలగారి వూరు మీదనుంచి పోతున్నా దిగలేదు. ఆఖరికి స్టేషనుకు రమ్మని కూడా రాయలేదామెకు. రాయడం, దిగడం దేనికి? ఎన్ని వుత్తరాలు రాసినా ఆమె అసలు విషయం ఎత్తుకోదు. కంటికి లేని దురద బచ్చలి కెందుకు? ఏదిఏమైనా ఆమె నిత్యమూ అతని హృదయంలో స్వైరవిహారం చేస్తోంది. ఆమెనే తలుచుకుంటూ బయట గుడ్డి వెన్నెలలోకి తొంగి చూస్తున్నాడు. దూరాన ఎవరో వెలిగించిపెట్టిన ఆకాశదీపం మినుకు మినుకంటోంది. అది అతనివైపు చూసి "తప్పు చేశేవు. దిగి లీలని చూసి రావలసింది" అంటోంది.

ఏమీ తోచక బయట వీచే చలిగాలికి తల ఆనుకుని కళ్లు మూసుకున్నాడు రామం. వెనకచూపు లేకుండా రైలు జరజరా పాకిపోతూంది. జలపాతాలెన్నిపడ్డా వినిపించని హోరు వాతావరణాన్ని ఆవరించింది. అలాగ ఎంతసేపు గడిచిందో రామానికే తెలియదు. చిట్రగుంట కాబోలు స్టేషను వచ్చింది. బయట పేపరు కుర్రాళ్ళ అరుపుతో మెలకువ వచ్చింది. ఏమీ తోచక అతనూ ఒక పేపరు పుచ్చుకున్నాడు. మందంగా వెలిగే దీపాల ముందు తన కళ్ళని తానే నమ్మలేక పోయాడు రామం.

"సంస్కరణ వివాహం. యం.యస్.సి. లో రాష్ట్రానికంతకీ ప్రథముడుగా వచ్చిన కృష్ణారావు అనే యువకుడు లీల అనే వితంతువైన తన వదినగారిని మొన్న పెళ్లి చేసుకున్నాడు. ఈ వివాహానికి పలువురు సంస్కర్తలు, దేశనాయకులు ఆశీస్సులు పంపేరు.

అప్రయత్నంగా పేపరు మూసి "లీలా" అని నిట్టూర్చాడు రామం. తెలివివచ్చి "ఔను. నన్ను ప్రేమించినట్లు లీల ఎప్పుడు చెప్పింది?" అనుకున్నాడు, దేనికీ అతని మనస్సు సమాధాన పడలేదు. వెర్రిగా నిస్పృహతో కళ్లు మూసుకున్నాడు, చల్లగాలికి తలవొగ్గి. అలాగ ఎంతసేపు గడిచిందో అతనికే తెలియదు. కాని, "ఏదో కంద, బచ్చలి అని అన్నిసార్లు పలవరించేరేమిటి?" అని ప్రక్కనున్న ఆసామీ తెల్లవారేక అడుగుతూంటే, మెలకువవచ్చి నవ్వుకున్నాడు.

